# ఉచిత వైద్యం

బస్తీలో ఉద్యోగంచేస్తున్నా, నేను వారం వారం మా వూరికి వెడుతూవుంటాను. ఎందువల్లనంటే, మా పొలం తాలూకు సేద్యపు పనులపైదాదాపు అధికభాగం అజమాయిషీ నేనే చేస్తుంటాను. నేనుచేసే ఉద్యోగం తీరికతో కూడుకున్నది కనుక, మావూరు ఓ అరగంట ప్రయాణపు దూరంలోనే వుంది కనుక నాకు ఎక్కువ శ్రమ అనిపించదు.

మా ఆవిడ, పిల్లలు మా వూరొచ్చి ఒకరోజు తోటలో కులాసాగా గడుపుదామనగా, ఒక లాయరు మిత్రుణ్ని కారు అడిగి తీసుకొని, ఆదివారం ఉదయం మావూరు వెళ్ళాను భార్యా పిల్లలతో సహా. భోజనంచేశాక నిమ్మతోటదగ్గరకు

బయలు దేరాం. కారును డొంకలో నిద్రగన్నేరు చెట్టుక్రింద ఆపి, పంటచేలు చూసుకుంటూ ఫర్లాంగుదూరం నడిచి తోట దగ్గరకు వెళ్ళాం. ఇద్దరు కూలీలు కరెంటు ఇంజనుతో నిమ్మ తోటకు నీటితడి కడుతున్నారు. మమ్మల్ని చూసి తోట కాపలా దారు రంగన్న గుడిసెలోనుంచి రెండుచాపలు తీసికొచ్చి చెట్లనీడలో పరిచాడు. మా ఆవిడ, పిల్లలు కూర్చున్నారు. నేను మోటు బావిదగ్గరకు వెళ్ళాను, చెట్టులపాదులలోకి ప్రవహించే నీటిజాలును చూస్తూ.

"బాబుగారూ! బాబుగారూ!" అంటూ నర్సిగాడు నురగలు కక్కుతుంటూ ఊళ్ళోనుంచి పరుగెత్తుకు వచ్చాడు.

ఇదివరకు వాడు మాదగ్గర అయిదేళ్ళపాటు పెద్దపాలేరుగా పనిచేశాడు. వాడిమీద మా ఇంట్లో వాళ్ళందరికీ సదభిప్రాయముంది.

వాడి ఆదుర్దాను, మొహంనిండా దిగకారుతోన్న చెమటనుచూసి "ఏమిట్రా!" అన్నాను ఆశ్చర్యంగా.

"బాబుగారూ! మీ కారు కాస్తివ్వండి. మా ఆడ వాళ్ళు ఆపదలో వుండారు బస్తికెళ్లాలి. పెద్దాసుపత్రికి"

"ఏం జరిగిందిరా!"

వాడు బావురుమని ఏడ్చాడు.

"నిన్న సందకాడ మా ఆడదాన్ని కాన్పుల ఆసుపత్రిలో చేర్చినానండి. రాత్రంతా నొప్పులొచ్చినాయి. కాని, బిడ్డ

బయటకు రాలేదండి. యమయాతన పడతానే వుండాది. పొట్టకోసి బిడ్డను బయటకు తియ్యాలని డాకటరు సుశీలమ్మగారు అన్నారండి. సరే అన్నాను. యాభై రూపాయలిమ్మన్నది. దరమాసుపత్రి గందా వూరికెనే సేయరా అన్నాను కాంపౌండరుతో. కాబట్టే యాభై రూపాయలు; లేకపోతే రెండొందలన్నాడండే, రోగి సావుబతుకుల్లో వుండగా బేరాలేమిటని, తెల్లారాక సుబ్బయ్యగారి సూరయ్య దగ్గర తల తాకట్టెట్టి యాభై రూపాయలు తెచ్చి అత్తారబత్తంగా యిచ్చానండి!"

"ఊఁ! ఆపరేషను చేసిందా!"

వాడి కళ్ళవెంట నీళ్ళు బొట బొట కారాయి. గొంతు దుఃఖంతో జవజవలాడింది.

హూఁ!...అదే కొంప ముంచింది. ఒట్టి అదురుగుండె మడిసి. అంత సేతకాకపోతే ఆపరేసనెందుకు సేయాలి?... తల్లిపొట్ట కోసేత్తూ, లోపలున్న బిడ్డ నేయికూడా పరపరా కోసేసింది. నెత్తుర్ను చూసి ఆమెకు కాళ్ళూ సేతులూ ఆడలేదు. "ఇహ నావల్లకాదు. బస్తీలో పెద్దాసుపత్రికి తీసికెళ్ళండి, బిడ్డ బతకదు. ఆలస్యంచేస్తే తల్లికూడా దక్కదు" అన్నది. మా కర్మకు మమ్మల్ని వొది లేసింది. మీరు కారేసుకు వూళ్లో కొచ్చారని ఎవరో సెప్పారు, మీకాడకు పరుగెత్తుకొచ్చాను."

సత్వరం డ్రైవరును పిల్చి, నర్సిగాడికి కారుయిచ్చి పంపాను. గవర్నమెంటు హాస్పటల్‌లో నాకు తెలిసిన డాక్ట

రోశాయన వుంటే, ఈ కేసును ప్రత్యేకమైన శ్రద్ధతో చూడవలసిందని చే ఉత్తరంకూడా వ్రాసియిచ్చాను.

మా వూళ్ళో పంచాయతీ సమితివారి పుణ్యాన రెండేళ్ళ క్రితమే మెటర్నిటీ హాస్పటల్ తెరువబడింది. అప్పటినుంచి ఇద్దరు డాక్టరమ్మలు మారినా, ఎం. బి., బి. యస్. డిగ్రీపుచ్చుకొని వైద్యానికి అర్హతను, అధికారాన్ని పొంది ప్రజాసేవలో ఒకభాగమైన వైద్యసేవ చేస్తూనే వున్నారు. ప్రణాళికా బద్ధమయిన గ్రామాభ్యుదయంలో ఉచితవైద్యం ఇమిడివున్నప్పటికీ, తృణమో పణమో "బహుమానాలు" రూపాయలు తీసుకుంటూ తమధర్మాలను సాగదీసి మారలు వేస్తూనే ఉన్నారు. కాని డాక్టరు సుశీల తొందరపాటు నాకు దారుణంగాను అమానుషంగాను తోచింది. డబ్బుపై కాపేక్షంకొద్దీ తనశక్తి సామర్థ్యాలను విస్మరించి – అన్యాయంగా రెండు ప్రాణాలతో ఆడుకోవడమేమిటి ! పదును కత్తితో కెలకడానికి ఇదేమయినా ప్రాణంలేని పదార్థమా ! భగవంతుని సృష్టిఅనగా – అరిచేతిలోని ఉసిరికాయగాదు. పాపం! నర్సిగాడిభార్యస్థితి ఎలావుందో!

మధ్యాహ్నం రెండు గంటలకు బస్తీనుంచి కారు వచ్చింది. "ఏమయింది!" డ్రైవరును అడిగాను ఆదుర్దాకొద్దీ. తనకేమీ తెలియదన్నీ, ఆసుపత్రిదగ్గర వాళ్ళను దించివచ్చానని డ్రైవరు చెప్పాడు.

ఆ సాయంత్రం మెటర్నిటీ హాస్పటల్ కు వెళ్ళాను డాక్టరు సుశీల గారితో మాట్లాడటానికి. నూతనంగా నిర్మించిన భవ

నంలో మెటర్నిటీ హాస్పటల్ చాలా అందంగా, హుందాగా వున్నది.

కాంపౌండరు కాళ్ళబల్ల మీద ఆరచావుకొని కూర్చుని, ఆ నాటి దినపత్రికలో మొహం దూర్చాడు. హాస్పటల్ అంతా దూడబోయిన ఆవులా బావురు మంటున్నది.

"డాక్టరుగారు లేరా?" అన్నాను.

"లేరు"

"ఇంకా హాస్పటల్‌కు రాలేదా?"

"రాలేదు. వారిని కలుసుకోవాలనివుంటే మూడు మాసాల తర్వాతరండి. మధ్యాహ్నమే సెలవుపెట్టి వారి స్వగ్రామం వెళ్ళారు" అన్నాడు కాంపౌండరు పేపరులోంచి మొహాన్ని తొలగిస్తూ.